సాక్షి
అనంతపురం
శనివారం । 29 । జూలై । 2023



చీనీ టన్ను రూ.21 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.21 వేలు పలికాయి. మార్కెట్‌కు 481 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.133
కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.133 పలికింది. కనిష్టం, రూ.100, సరాసరి రూ.120 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.4°/21.8°
జిల్లా అంతటా శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగింది. వాయువ్య దిశగా గాలులు గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

బాలల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం సెంట్రల్: ప్రధానమంత్రి రాష్ట్రీయ బాలల పురస్కారాలు–2024కు అర్హులైన బాలల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేంద్ర మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. 18 ఏళ్ల లోపు బాలబాలికలు క్రీడలు, సామాజిక సేవా రంగం, ధైర్య సాహసాలు, నూతన ఆవిష్కరణలు, పర్యావరణ పరిరక్షణ, సాంస్కృతిక, సంప్రదాయ, శాస్త్ర సాంకేతిక, విజ్ఞానాలు తదితర రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారు ఆగస్టు 31లోగా https//awards.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

తిరుపతి - షోలాపూర్ మధ్య వీక్లీ ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా తిరుపతి – షోలాపూర్ మధ్య వారాంతపు (వీక్లీ) ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అగస్టు 3న (గురువారం) రాత్రి 9.40 గంటలకు షోలాపూర్ జంక్షన్‌లో వీక్లీ రైలు (01437) బయలుదేరి మరుసటి రోజు రాత్రి 7.45 గంటలకు తిరుపతి జంక్షన్‌కు చేరుతుందన్నారు. తిరిగి ఈ రైలు (01438) శుక్రవారం రాత్రి 9.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 7.10 గంటలకు షోలాపూర్ చేరుతుందన్నారు. ఈ రైలు రేణిగుంట, రాజంపేట, కడప, యర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు జంక్షన్, ఆదోని, మంత్రాలయం, రాయచూరు, యాదగిరి, వాడీ జంక్షన్, కలబుర్గి, హుమ్నాబాద్, బీదర్, బాల్కి, ఉద్గిర్, లాతూర్ రోడ్డు, లాతూర్ మీదుగా షోలాపూర్‌కు చేరుతుందని వివరించారు.

ఇద్దరు యువకులు దుర్మరణం

- ఆత్మకూరులో రోడ్డు ప్రమాదం
- మృతులు కర్నూలు జిల్లావాసులు




మృతులు రాఘవేంద్ర, అనిల్‌కుమార్ (ఫైల్)

ఆత్మకూరు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన మేరకు.. కర్నూలు జిల్లా పగిడిరాయి గ్రామానికి చెందిన రాఘవేంద్ర (27) సమీప బంధువు అనిల్ కుమార్ (25) అర్చకులు. వీరు ఆత్మకూరులోని సమీప బంధువు అయిన కానిస్టేబుల్ రమేష్‌ను కలిసేందుకు శుక్రవారం ద్విచక్రవాహనంపై వచ్చారు. అయితే కానిస్టేబుల్ మొహర్రం సందర్భంగా విధుల్లో బిజీగా ఉండటంతో వారిద్దరూ సాయంత్రం ఏడు గంటల తర్వాత తిరుగుపయనమయ్యారు. వీరి ద్విచక్రవాహనం ఆత్మకూరులోని కళ్యాణదుర్గం రోడ్డుపైకి చేరుకోగానే ఎదురుగా వచ్చిన ఐషర్ వాహనం వేగాన్ని నియంత్రించలేక ఢీకొంది. ఈ ప్రమాదంలో రాఘవేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన అనిల్ కుమార్‌ను 108 వాహనంలో అనంతపురం సర్వజనాస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే ప్రాణం విడిచాడు. కాగా.. అనిల్‌కుమార్‌కు ఏడాది కిందటే పెళ్లయ్యింది. రాఘవేంద్రకు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తాపడి మరొకరు..



మృతుడు వెంకటేష్

పెద్దవడుగూరు: గుత్తి నుంచి శుక్రవారం గార్లదిన్నెకు వెళ్తున్న ఆటోకు పెద్దవడుగూరు మండలం కాసేపల్లి టోల్‌గేట్ సమీపంలో కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో గార్లదిన్నె మండలం కేశవాపురానికి చెందిన వెంకటేష్ అనే ప్రయాణికుడు (60) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్‌ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు.

ఏపీఎంఐపీ ఏపీడీగా ఫజలున్నీసాబేగం



అనంతపురం అగ్రికల్చర్: ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు (ఏపీఎంఐపీ) జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఏపీడీ)గా ఫజలున్నీసాబేగంను నియమిస్తూ ఉద్యాన శాఖ కమిషనరేట్ నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. తాడిపత్రి డివిజన్ నార్పలలో హార్టికల్చర్ ఆఫీసర్‌గా (హెచ్‌ఓ)గా పనిచేస్తున్న ఫజలున్నీసాబేగంకు పదోన్నతి కల్పిస్తూ ఏపీడీగా బదిలీ చేశారు.

భక్తజన సంద్రం



గూగూడు కుళ్లాయిస్వామి ఉత్సవాల్లో పెద్దసరిగెత్తుకు తరలివచ్చిన భక్తజనం



భక్తులకు దర్శనమిస్తున్న గూగూడు కుళ్లాయిస్వామి పీర్ల సమూహం

- అన్ని దారులూ గూగూడు వైపే..
- అంగరంగ వైభవంగా పెద్ద సరిగెత్తు
- కుళ్లాయిస్వామిని దర్శించుకున్న భక్తులు

నార్పల: హిందూ, ముస్లింలు కలిసి జరుపుకొనే గూగూడు బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టం కోలాహలంగా సాగింది. శుక్రవారం పెద్ద సరిగెత్తు అంగరంగ వైభవంగా జరిగింది. అన్ని దారులు గూగూడు వైపే సాగాయి. భక్తుల సౌకర్యార్థం తాడిపత్రి, ధర్మవరం, అనంతపురం తదితర డిపోల నుంచి గూగూడుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపింది. అలాగే ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు తదితర ప్రైవేట్ వాహనాలపై వేలాదిమంది తరలివచ్చారు. గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరం వరకు ఎక్కడ చూసినా టెంట్లు/గుడారాలు భక్తులతో నిండిపోయాయి. నియమ నిష్టలతో భక్తులు కుళ్లాయిస్వామి పీరును దర్శించుకుని తరించారు. ఫకీర్లు పానకాలు సమర్పించగా.. భక్తులు పొర్లుదండాలు పెడుతూ, తలనీలాలు ఇస్తూ, మరికొందరు చక్కెర చదివింపులతో మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన దుకాణాలతో పాటు జెయింట్‌వీల్ తదితర క్రీడా వినోదాల వద్ద జనం కిక్కిరిసిపోయారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు 1100 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. ఇదిలా ఉండగా శనివారం ఉదయం అగ్నిగుండ ప్రవేశం, గ్రామోత్సవం, సాయంత్రం జలధోత్సవం జరగనుంది. కుళ్లాయిస్వామి తదితర పీర్లను దర్శించుకునేందుకు భారీగా వచ్చే భక్తులతో మరింత రద్దీ పెరగనుంది.



అగ్ని గుండంలోకి కొబ్బరిచిప్పలు వేస్తూ..



స్వామి దర్శనం కోసం ఎదురుచూపు..



చక్కెర చదివింపులతో మొక్కులు



ఆలయ పరిసరాల్లో జనంతో కిక్కిరిసిన ఎగ్జిబిషన్, దుకాణాలు

రాయలసీమ ద్రోహి చంద్రబాబే

- మూడుసార్లు సీఎం అయినా ఒక్క ప్రాజెక్టూ తేలేదు
- మంత్రి ఆర్కే రోజా ధ్వజం



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి రోజా, చిత్రంలో ఎమ్మెల్యే అనంత, మహాలక్ష్మి శ్రీనివాస్

రాప్తాడురూరల్: నిజమైన రాయలసీమ ద్రోహి చంద్రబాబేనని రోజా విమర్శించారు. శుక్రవారం అనంతపురంలో పర్యటించిన ఆమె మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాయలసీమలో పుట్టి ఈ ప్రాంతం నుంచి రాజకీయంగా ఎదిగి ఇక్కడి ప్రజల ఆశీర్వాదంతో మూడుసార్లు ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు ఒక్క ప్రాజెక్టూ తీసుకురాలేదన్నారు. అలాంటి వ్యక్తి ప్రాజెక్టుల అంశంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గురించి మాట్లాడడం చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని విమర్శించారు. చిత్తూరు జిల్లాకు చంద్రబాబు పెద్ద గుండుసున్నా చుట్టారన్నారు. విజన్ ఉంది.. విస్తరాకుల కట్ట ఉందని చెప్పే చంద్రబాబు తన పాలనలో ప్రాజెక్టులు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు.

పవన్ వల్ల మిస్సయిన వారి లెక్కలు తీయాలి..
పవన్ కళ్యాణ్ వల్ల ఎంతమంది మిస్ అయ్యారో లెక్కలు తీయాలని రోజా డిమాండ్ చేశారు. ఆయనకు రాజకీయ అవగాహన లేదన్నారు. చంద్రబాబు రాయించిన స్క్రిప్ట్ తప్ప ఒక ప్రశ్న అదనంగా అడిగినా మాట్లాడలేని పరిస్థితి ఉందన్నారు. కేంద్ర నిఘా సంస్థ ఇచ్చిందంటూ దొంగ లెక్కలు చూపుతున్నారన్నారు. గంజాయి హెరిటేజ్ పాల క్యాన్లలో దొరికిందన్నారు. ఎర్ర చందనం నారావారిపల్లిలో చంద్రబాబు పొలాల్లో దొరికిందన్నారు. పుత్తూరుకు చెందిన తెలుగుయువత అధ్యక్షుడు హరికృష్ణ ఎర్రచందనం స్మగ్లింగ్‌లో దొరికాడన్నారు. అతన్ని లోకేష్ పక్కనే నిలబెట్టుకున్నాడన్నారు. గంజాయి పండించేది, అమ్మేది, యువత జీవితాల్ని నాశనం చేసేది తెలుగుదేశం పార్టీనేనన్నారు. సమావేశంలో అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, అహుడా చైర్మన్ మహాలక్ష్మీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలతో అభివృద్ధి, ఉపాధి

- పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి
- అధికారులకు కలెక్టర్ గౌతమి సూచన

అనంతపురం అర్బన్: పరిశ్రమల ఏర్పాటుతో జిల్లా అభివృద్ధి, ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కలెక్టర్ గౌతమి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందన్నారు. పారిశ్రామికవేత్తలకు విరివిగా రుణాలు ఇవ్వాలన్నారు. కొత్తగా పరిశ్రమలు స్థాపించేందుకు ఆసక్తి చూపే వారికి అవసరమైన సహకారం అందించాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు మరిన్ని రుణాలు అందించేందుకు, యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఉపాధి అవకాశాలు కల్పించే సేవారంగ పరిశ్రమలకు అధిక ప్రోత్సాహం అందించాలని సూచించారు. ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లు స్థాపించేందుకు అనువైన ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని పరిశ్రమల శాఖ అధికారి, ఏపీఐఐసీ జెడ్‌ఎంలను ఆదేశించారు.

సబ్సిడీ మంజూరుకు ఆమోదం..
జిల్లాలో 2015–20 ఇండస్ట్రియల్ పాలసీలో రెండు యూనిట్లకు రూ.6.50 లక్షలు, 2020–23 పాలసీలో రెండు యూనిట్లకు రూ.11.83 లక్షలు, జగనన్న బడుగు వికాసం కింద 8 యూనిట్లకు రూ.1.07 కోట్ల సబ్సిడీ మంజూరుకు కమిటీ ఆమోదం తెలిపింది. సింగిల్‌విండో పోర్టల్‌లో జూన్, జూలై నెలల్లో 198 దరఖాస్తులు రాగా 181 దరఖాస్తులను ఆమోదించగా, నాలుగు దరఖాస్తులను తిరస్కరించామని కలెక్టర్‌కు అధికారులు చెప్పారు.



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో పరిశ్రమల శాఖ జీఎం నాగరాజారావు

యూనిట్లు గ్రౌండింగ్ కావాలి..
పీఎంఈజీపీ పథకం కింద మంజూరైన అన్ని యూనిట్లు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పీఎంఈజీపీ 2023–24 ఆర్థిక సంవత్సరంలో 341 దరఖాస్తులను బ్యాంకులకు పంపించామని కలెక్టర్‌కు అధికారులు వివరించారు. నిర్దేశించిన 244 యూనిట్లలో రూ.2.97 కోట్ల మార్జిన్ మనీతో 94 యూనిట్లు గ్రౌండింగ్ అయ్యాయని తెలిపారు. రూ.3.22 కోట్ల మార్జిన్ మనీతో 105 యూనిట్లు మంజూరు దశలో ఉన్నాయని చెప్పారు. స్టాండప్ ఇండియాలో ప్రతి బ్యాంకూ ఇద్దరికి పరిశ్రమ, సర్వీసింగ్ వ్యాపారం యూనిట్ల స్థాపనకు రుణ సహాయం చేసేలా చర్యలు తీసుకోవాలని ఎల్‌డీఎంను ఆదేశించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం నాగరాజారావు, ఏపీఐఐసీ జెడ్‌ఎం వరప్రసాద్, ఎల్‌డీఎం సత్యరాజ్, ఫ్యాక్టరీస్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కేశవులు, ఫ్యాప్సీ అధ్యక్షుడు శేషాంజినేయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు నివారించాలి
జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నివారణ లక్ష్యంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శుక్రవారం రెవెన్యూ భవన్‌లో జిల్లాస్థాయి రహదారి భద్రత సమావేశాన్ని ఎస్పీ కె.శ్రీనివాసరావు, డీటీసీ వీర్రాజుతో కలిసి నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన 39 బ్లాక్ స్పాట్ల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ ధరించని ఉద్యోగులపై కేసులు నమోదు చేయాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ యుగంధర్, పీఆర్ ఎస్‌ఈ భాగ్యరాజ్, జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, పీహెచ్ ఈఈ సతీష్‌రెడ్డి, ఆర్టీసీ అధికారి రమేశ్‌బాబు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు సంభవించరాదు
మాతాశిశు మరణాలు సంభవించకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై శుక్రవారం రెవెన్యూ భవన్‌లో డీఎంహెచ్‌ఓ యుగంధర్‌తో కలిసి వైద్యారోగ్య శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. గత నెలలో రెండు మాతృ మరణాలు, రెండు శిశు మరణాలు చోటు చేసుకున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. పుట్లూరు మండలం సంజీవపురం గ్రామానికి చెందిన శ్రీనివాసులు భార్య మణిలక్ష్మి మరణంపై సమగ్ర విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పీహెచ్‌సీల పరిధిలో హైరిస్క్ ప్రెగ్నెన్సీ కేసుల విషయంలో నిర్లక్ష్యంగా ఉండరాదని హెచ్చరించారు. ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి మాతృ, శిశు మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని కచ్చితమైన ఆదేశాలు ఇవాలని చెప్పారు. సమావేశంలో అధికారులు శంషాద్ బేగం, సుజాత, మారుతీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గలగలా తుంగభద్ర జలాలు



డ్యాం వద్ద స్విచ్ బోర్డుకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న తుంగభద్ర బోర్డు సెక్రటరీ నాగమోహన్, ఎస్‌ఈ శ్రీకాంత్‌రెడ్డి, ఈఈ రవిచంద్ర



హెచ్చెల్సీలో పారుతున్న జలాలు

- హెచ్చెల్సీకి నీరు విడుదల
- వాయనం సమర్పించిన బోర్డు అధికారులు

బొమ్మనహాళ్/అనంతపురం సెంట్రల్: తుంగభద్ర జలాశయం నుంచి ఎగువ కాలువ (హెచ్చెల్సీ)కు శుక్రవారం నీరు విడుదలైంది. తొలుత తుంగభద్ర బోర్డు సెక్రటరీ జి.నాగమోహన్, ఎస్‌ఈ శ్రీకాంత్‌రెడ్డి, హెచ్చెల్సీ ఈఈ రవిచంద్ర, ఎల్‌ఎల్‌సీ ఈఈ నీలికాంతరెడ్డి డ్యాంపై పూజలు చేసిన తర్వాత స్విచ్ ఆన్ చేసి హెచ్చెల్సీతో పాటు ఎల్‌ఎల్‌సీకి నీటిని విడుదల చేశారు. అనంతరం సంప్రదాయబద్ధంగా వాయనం వదిలారు. బోర్డు సెక్రటరీ నాగమోహన్ మాట్లాడుతూ తుంగభద్ర ఎగువ కాలువకు తొలుత 100 క్యూసెక్కుల నీరు వదిలి.. ప్రతి రెండు గంటలకొకసారి క్యూసెక్కులు పెంచుతామని తెలిపారు. తొలిరోజు హెచ్చెల్సీకి 500 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు వెల్లడించారు. ఆంధ్ర, కర్ణాటక కోటా రెండూ కలిపి కాలువకు నీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఎల్‌ఎల్‌సీకి కూడా 100 క్యూసెక్కులు నీరు వదిలి.. ప్రతి రెండు గంటలకు ఒకసారి క్యూసెక్కులు పెంచుతామన్నారు. శనివారం సాయంత్రం ఆరు గంటకల్లా ఆంధ్ర సరిహద్దులోని బొమ్మనహాళ్ మండలంలో 105వ కిలోమీటర్ వద్దకు తుంగభద్ర జలాలు చేరుతాయని అధికారులు తెలిపారు. పూజా కార్యక్రమంలో డీఈలు జగదీష్, అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న వరద: తుంగభద్ర జలాశయానికి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. శుక్రవారం ఉదయానికి 1,07,118 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. 1,633 అడుగుల నీటిమట్టానికి గాను 1,619 అడుగులకు చేరి, 60.001 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు.

ఐఏబీ సమావేశం తర్వాతే ఆయకట్టుకు..: తుంగభద్ర జలాశయం నుంచి దామాషా ప్రకారం హెచ్చెల్సీకి 26.828 టీఎంసీలు వస్తాయని అధికారులు తెలిపారు. జలాశయం నుంచి హెచ్చెల్సీకి నీటిని విడుదల చేసిన నేపథ్యంలో నీటి కేటాయింపుల విషయంపై సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం నిర్వహించనున్నట్లు హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్ తెలిపారు. కలెక్టర్, ప్రజాప్రతినిధుల సూచనల మేరకు ఆయకట్టుకు ఎప్పటి నుంచి నీటిని విడుదల చేయాలనే అంశంపై నిర్ణయం తీసుకుంటారన్నారు. తొలుత హైలెవల్ మెయిన్ కెనాల్, గుంతకల్లు బ్రాంచ్ కెనాల్‌కు వదిలి.. పీఏబీఆర్, ఎంపీఆర్‌లో నీటి నిల్వ అనంతరం ఎంపీ సౌత్, నార్త్ ఇతరత్ర ఉప కాల్వలకు నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు.

ఉద్యాన వికాసం

- రూ.9.15 కోట్లతో కార్యాచరణ ప్రణాళిక
- 4,847 మంది రైతులకు పథకాల ఫలాలు
- వైఎస్సార్ ఉచిత పంటల బీమాతో లబ్ధి




పూల తోట, (ఇన్‌సెట్) జిల్లాలో పండుతున్న నాణ్యమైన అరటి



చీనీ

అనంతపురం అగ్రికల్చర్: ఉద్యాన తోటల విస్తీర్ణం, దిగుబడులు, ఫలసాయం టర్నోవర్ పరంగా ఫ్రూట్‌బౌల్ ఆఫ్ ఏపీగా పేరుగాంచిన అనంతపురం జిల్లాలో ఉద్యాన వికాసానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు పెద్ద పీట వేసి, ప్రోత్సహిస్తోంది. ఈ క్రమంలో ప్రస్తుత 2023–24 సంవత్సరానికి గాను ఉద్యాన పథకాల అమలుకు ఆశాఖ అధికారులు కార్యాచరణ ప్రణాళిక తయారు చేశారు. ఈ ఏడాది మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్ (ఎంఐడీహెచ్) కింద రూ.9.15 కోట్లు కేటాయించారు.

17 పథకాల అమలుకు గ్రీన్‌సిగ్నల్
ఉద్యాన శాఖ ద్వారా ఈ ఏడాది 17 పథకాల అమలుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఎంఐడీహెచ్ కింద రూ.7.50 లక్షల విలువ కలిగిన చిన్నపాటి నర్సరీల ఏర్పాటుకు రూ.15 లక్షలు, కొత్తగా 1,475 హెక్టార్లలో పండ్లతోటల విస్తరణకు రూ.1.14 కోట్లు, రెండు, మూడేళ్ల పాటు వాటి నిర్వహణకు రూ.76 లక్షలు కేటాయించారు. పుట్టగొడుగుల పెంపకానికి రూ.24 లక్షలు, కమ్యూనిటీ ఫారం పాండ్స్‌కు రూ.కోటి, వ్యక్తిగత ఫారంపాండ్లకు రూ.38 లక్షలు, ప్లాస్టిక్ మల్చింగ్‌కు రూ.1.41 కోట్లు కేటాయింపులు చేశారు. యాంటీబర్డ్ నెస్ట్ ఏర్పాటుకు రూ.17 లక్షలు, ప్యాక్‌హౌస్‌లకు రూ.1.28 కోట్లు, సోలార్ కోల్డ్ రూమ్‌లకు రూ.26 లక్షలు, కలెక్షన్ సెంటర్లకు రూ.1.80 కోట్లు వెచ్చించనున్నారు. మినీ ట్రాక్టర్లకు రూ.16 లక్షలు, తైవాన్ స్ప్రేయర్లకు రూ.16 లక్షలు, ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్లకు రూ.10 లక్షల, ఐపీఎం కింద రూ.6 లక్షలు, శిక్షణ కార్యక్రమాలకు రూ.8 లక్షలు వ్యయం చేయాలని ప్రణాళిక తయారు చేశారు.



బొప్పాయి

జిల్లాలో ఉద్యాన పంటల విస్తీర్ణం ఇలా..		
పంట రకం	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	దిగుబడి (మెట్రిక్ టన్నుల్లో)
అన్ని రకాల పండ్ల తోటలు	65,111	19,31,626
కూరగాయలు	27,217	14,85,882
పూలతోటలు	355 „	2,840 „
సుగంధ ద్రవ్యాలు	28,000	2,29,400
ఔషధ పంటలు	50	250
తోట పంటలు	236	472
మొత్తం ఉద్యాన తోటలు	1,20,969	36,50,510

- ఈ ఏడాది మొత్తంగా 4,847 మంది రైతులకు లబ్ధి చేకూర్చనున్నారు. అందులో ఎస్సీలు 666, ఎస్టీలు 313, జనరల్ కోటా కింద 3,868 మంది రైతులకు ప్రయోజనం కల్పించేలా కార్యాచరణ రూపొందించారు. మొత్తం బడ్జెట్‌లో ఎస్సీ వర్గాలకు రూ.1.43 కోట్లు, ఎస్టీ వర్గాలకు రూ.48 లక్షలు, జనరల్ కోటా కింద రూ.7.25 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ఉద్యాన శాఖ జిల్లా అధికారి బి.రఘునాథరెడ్డి తెలిపారు. ఇప్పటికే అర్హులను గుర్తించి, ఆన్‌లైన్ ప్రక్రియ మొదలు పెట్టామన్నారు. పథకాలు అమలు చేస్తూనే మేలైన యాజమాన్య పద్ధతులు, ఎగుమతులు, రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపరచడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం 'వైఎస్సార్ ఉచిత పంటల బీమా' కింద చీనీ, దానిమ్మ, ద్రాక్ష, టమాట తదితర పంటలకు బీమా పథకం వర్తింపజేస్తూ మూడేళ్లుగా పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటోందన్నారు. పండ్లతోటల రైతులు హార్టికల్చర్ అధికారుల (హెచ్‌వో)ను సంప్రదించి వివరాలు తెలుసుకుని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. త్వరలోనే ఆర్‌కేవీవై, స్టేట్‌ప్లాన్ కింద మరికొంత బడ్జెట్, పథకాలు ప్రకటించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

400 చీనీ చెట్లు దగ్ధం

• రూ.20 లక్షల నష్టం



మంటల్లో కాలిపోయిన చీనీ చెట్లు

గార్లదిన్నె: మండల పరిధిలోని కొట్టాలపల్లిలో శుక్రవారం అగ్నిప్రమాదంలో 400 చీనీ చెట్లు కాలిపోయాయి. బాధిత రైతు వివరాలమేరకు.. కొట్టాలపల్లికి చెందిన ఆదిశేషయ్య అనే రైతు 400 చీనీ చెట్లు సాగు చేసేవారని తెలిపారు. వ్యవసాయ పొలంలో 11 కేవీ విద్యుత్ వైర్లు తెగి నెలపై పడడంతో 400 చీనీ చెట్లకు మంటలు వ్యాపించి అగ్నికి ఆహుతయ్యాయన్నారు. రైతు ఆదిశేషయ్య మధ్యాహ్నం తోటలో విద్యుత్ మోటర్ ఆన్ చేయడానికి వెళ్లగా మంటల్లో చీనీ చెట్లు కాలిపోయినట్లు గుర్తించారన్నారు. ఈమేరకు బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాయలచెరువులో భారీ దొంగతనం

• 15 తులాల బంగారు, 3 కేజీల వెండి చోరీ



బంగారు షాపులో యజమాని నుంచి వివరాల తెలుసుకుంటున్న డీఎస్పీ గంగయ్య

యాడికి: మండల పరిధిలోని రాయలచెరువులో భారీ దొంగతనం జరిగింది. 15 తులాల బంగారం, దాదాపు మూడు కేజీల వెండి అపహరణకు గురైంది. ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి వివరాల మేరకు.... నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం చంద్రపల్లెకి చెందిన కమ్మర విశ్వరూప ఆచారి 20 ఏళ్ల క్రితం రాయలచెరువులో బస్టాండు సమీపంలో ఉన్న కాంప్లెక్స్‌లో నివసిస్తూ గణేష్ జ్యువెలరీ షాపును నిర్వహిస్తున్నారు. శుక్రవారం తన కుమార్తె పుట్టిన రోజును సొంతూరులో జరుపుకోవాలని గురువారం రాత్రి 10 గంటల వరకు బంగారు షాపులో ఉండి చంద్రపల్లెకు వెళ్లారు. ఇందులో భాగంగానే దుండగులు అర్ధరాత్రి షాపు షట్టర్ బీగాలు తొలగించి లోపలకు వెళ్లారు. సీసీ కెమెరాలతో పాటు చిన్న బీరువాలోని 15 తులాల బంగారు, దాదాపు 3 కేజీల వెండి దోచుకెళ్లారు. శుక్రవారం ఉదయం షాపుకు వచ్చిన విశ్వరూప ఆచారికి షట్టర్ బీగాలు తీసిఉంచడంతో లోపలికి వెళ్లి చూడగా దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శంకర్‌రెడ్డి, డీఎస్పీ సీఎం గంగయ్య, డాగ్‌స్క్వాడ్, వ్రేలిముద్ర నిపుణులు వచ్చి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు.

రాష్ట్రంలో అగ్రగామిగా ఎస్కేయూ

• నాణ్యమైన పరిశోధనలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా గుర్తింపు
• ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి
• అట్టహాసంగా ఎస్కేయూ 42వ ఆవిర్భావ దినోత్సవం





ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి మెమొంటో అందిస్తున్న ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

అనంతపురం: నాణ్యమైన పరిశోధనలు.. అత్యుత్తమ బోధన, అంకితభావంతో పనిచేసే ఉద్యోగులు.. సమాజోపయోగకరమైన ఆవిష్కరణలు అన్ని అంశాల్లోనూ శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రాష్ట్రంలో అగ్రగామిగా ఉంది' అని వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి అన్నారు. ఎస్కేయూ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం భువన విజయం ఆడిటోరియంలో అట్టహాసంగా నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ... గడిచిన మూడేళ్లలో విశేషమైన మైలు రాయిని అధిగమించామన్నారు. అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం ద్వారా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను తయారు చేస్తున్నామని తెలిపారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థకు సంబంధించిన ప్రాంతీయ వాతావరణ పరిశోధన స్థానంతో వర్సిటీ కీర్తి జాతీయ స్థాయిలో ఇనుమడింపజేశామన్నారు. బోటనీ విభాగంలో 40 వేల స్పెసిమెన్లు ఏర్పాటు చేసి సరికొత్త రికార్డును సృష్టించినట్లు వివరించారు. ఈ జాబితాలో దక్షిణ భారత దేశంలోనే రెండో వర్సిటీగా ఖ్యాతి దక్కిందన్నారు. నూతన జాతీయ విద్యావిధానం-2020 ను పకడ్బందీగా అమలు చేస్తూ నైపుణ్యాధికారిత కోర్సులను ప్రవేశపెట్టామన్నారు. మూడు స్నాతకోత్సవాలను నిర్వహించిన ఘనత లభించిందన్నారు. రూ.5 కోట్ల విలువైన ఇండోర్ స్టేడియంను పూర్తి చేసి రెండు నెలల్లో విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామన్నారు. 86.76 ఎకరాల భూమిని రికవరీ చేసి వర్సిటీ ఆస్తిని పరిరక్షించామని పేర్కొన్నారు.

అంకితభావంతో కష్టపడాలి..

విశిష్ట అతిథిగా హాజరైన యూపీఎస్సీ మాజీ సభ్యులు వై. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ... శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తనకు గౌరవ డాక్టరేట్ ప్రకటించిందన్నారు. అనంతరం జేఎన్‌టీయూ అనంతపురం తదితర వర్సిటీలు గౌరవ డాక్టరేట్ ఇచ్చినప్పటికీ తనలోని ప్రతిభను గుర్తించిన తొలి వర్సిటీ ఎస్కేయూ అని స్పష్టం చేశారు. ఎస్కేయూనివర్సిటీ ఎంతో పురోగతి సాధించిందన్నారు. ఎంతో మంది ఐఏఎస్, ఐపీఎస్ వంటి సివిల్ సర్వెంట్లను అందించిన ఘనత ఉందన్నారు. అంకితభావంతో కష్టపడితే ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో యోగివేమన వర్సిటీ వీసీ చింతా సుధాకర్ (ఎస్కేయూ పూర్వ విద్యార్థి), రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, ప్రిన్సిపాల్ ఏ. కృష్ణకుమారి ప్రసంగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. క్రీడలు, వివిధ కార్యక్రమాల్లో ప్రతిభ బహుమతులు ప్రదానం చేశారు.

నాయకులుగా ఎదగాలి..

రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ... రామకృష్ణారెడ్డి వీసీ అయిన తరువాత వర్సిటీలో మౌలిక సదుపాయాల కల్పన జరిగిందన్నారు. రోడ్లు, భవనాలు ఈ మధ్యనే గవర్నర్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగిందని చెప్పారు. ఉన్నత స్థానంలో ఉన్న పూర్వ విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించింది ఉస్మానియా యూనివర్సిటీ ఘనతేనన్నారు. బలహీనులకు , పుట్టిన ఊరు, ప్రాంతానికి దన్నుగా నిలవాల్సిన నాయకులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో రాజకీయ చైతన్యం కలగాలని, బాగా చదివి బాగా జీవితంలో రాణించాలన్నారు. వర్సిటీలో అనేక కోర్సులు ఉన్నాయని, ఈ ప్రాంత వ్యవసాయాభివృద్ధికి దోహదపడే అగ్రికల్చర్ బీఎస్సీ, డెయిరీ సైన్సెస్ కోర్సులు వర్సిటీలో ఏర్పాటు చేయాలని వీసీని కోరారు. వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే కాబట్టి వచ్చే ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి ఈ కోర్సులను సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా ప్రారంభించాలని ఆశిస్తున్నానన్నారు. అగ్రికల్చర్ బీఎస్సీ అనంతపురంలో కేవలం ప్రైవేట్ కళాశాలల్లో ఉన్నాయని, ఈ నేపథ్యంలో ఎస్కేయూనివర్సిటీలో ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ మధ్య కాలంలోనే వీసీ సహకారంతో వర్సిటీలో మెగా జాబ్‌మేళాను నిర్వహించి 1200 మందికి ఉద్యోగాలు కల్పించడం హర్షణీయమన్నారు. ఆర్.సీ.రెడ్డి స్టడీ సర్కిల్ వంటి కోచింగ్ సెంటర్ల సహకారంతో ఎస్కేయూ విద్యార్థులకు గ్రూప్స్‌కు కోచింగ్ ఇప్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున కృషి చేస్తామన్నారు. ఇందుకు గాను రూ.10 లక్షల విరాళంగా ప్రకటిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

ఉరవకొండ: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న టెట్రా ప్యాకెట్లను గురువారం అర్ధరాత్రి విడపనకల్లు చెక్‌పోస్టు దగ్గర ఉరవకొండ సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సెబ్ సీఐ మారుతీరావు వివరాలమేరకు... విడపనకల్లు చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బళ్లారి నుంచి తిరుపతికి వెళ్లే కర్ణాటక బస్సులో కూడేరు మండలం ఉదిరిపికొండకు చెందిన రామాంజినేయులు, వీరేష్‌ల నుంచి 720 టెట్రా ప్యాకెట్లను ఎస్ఈబీ పోలీసులు పట్టుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచండి



వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర బృందం సభ్యులు

బుక్కరాయసముద్రం: గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా చర్యలు చేపట్టాలని కేంద్ర బృందం సభ్యుడు మణికంఠ పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కేంద్రం బృందం సభ్యులు మండల పరిధిలోని కొర్రపాడు గ్రామంలో పర్యటించారు. ఇందులో భాగంగానే గ్రామస్తులతో సమావేశమయ్యారు. గ్రామంలో వీధులు శుభ్రత పాటించేలా అధికారులు ఎలాంటి కృషి చేస్తున్నారని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. చెత్త సేకరణ ఏ విధంగా సేకరిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల వినియోగాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ భాస్కర్, ఈఓఆర్‌డీ దామోదరమ్మ, ఉప సర్పంచ్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులపై చంద్రబాబు వ్యాఖ్యలు సిగ్గుచేటు

• వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

తాడిపత్రి: రాష్ట్రంలోని ప్రాజెక్టులపై తెలుగుదేశం పార్టీ అధినేత, ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు గత కొన్ని రోజులుగా మీడియా ముఖంగా చేస్తున్న వ్యాఖ్యలు సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య అన్నారు. శుక్రవారం ఆయన తాడిపత్రిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ప్రాజెక్టుల పేరుతో వేల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేశారన్నారు. టీడీపీ హయాంలో ప్రాజెక్టుల కోసం రూ.68,293 కోట్లు ఖర్చు చేసినా కేవలం 3.40 లక్షల ఎకరాలకు మాత్రమే నీరు అందించారన్నారు. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ. 27,394 కోట్లు ఖర్చు చేసి 5 లక్షల ఎకరాలకు నీరందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌దేనన్నారు. తెలంగాణ ప్రభుత్వం అక్రమంగా, ఎలాంటి అనుమతులు లేకుండా రంగారెడ్డి, పాలమూరు, దిండి ఎత్తిపోతల పథకం, ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని పెంచుకుంటూ నిర్మాణాలు చేపడుతూ పోతున్న సమయంలో ఆ నాడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఓటుకు నోటు కేసులకు భయపడి నోరెత్తకుండా రైతులకు అన్యాయం చేశారన్నారు. రైతు ద్రోహివైన చంద్రబాబుకు ప్రాజెక్టుల గురించి మాట్లాడే అర్హతలేదన్నారు. నీరు – చెట్టు పథకంతో రూ. 21,400 కోట్లను అనుచరులకు దోచిపెట్టిన ఘనుడు బాబు అని విమర్శించారు. 2018 చివరి నాటికి పోలవరాన్ని పూర్తి చేస్తానని చెప్పి.. కేవలం పోలవరాన్ని ఏటీఎంలా స్వార్థానికి వాడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కనీసం ఒక్క ప్రాజెక్టును అయినా చేపట్టి, పూర్తి చేశారా? అని ప్రశ్నించారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో జలయజ్ఞం ద్వారా లక్ష కోట్ల రుపాయల వ్యయంతో 24 ప్రాజెక్టులను 2009 నాటికి 23 పూర్తి చేశారన్నారు. గాలేరు నగరి , హంద్రీ నీవా, తెలుగు గంగ తదితర ప్రాజెక్టులను సింహభాగం పూర్తి చేయగా, ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయా ప్రాజెక్టులను పూర్తి చేస్తూ, పెన్నా బ్యారేజీ, సంగం బ్యారేజీలను జాతికి అంకితం చేశారని తెలిపారు. ప్రాజెక్టుల గురించి తప్పుడు మాటలు మాట్లాడుతూ ప్రజలను మోసం చేయాలని చూస్తే వచ్చే ఎన్నికల్లో పుట్టగతులు లేకుండా చేసేందుకు రాష్ట్ర ప్రజలు ఓటుతో సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య





మృతులు ఈశ్వరమ్మ, యశోద

గుంతకల్లు రూరల్: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు బలవన్మరణానికి పాల్పడ్డారు. గుంతకల్లు మండల పరిధిలోని నక్కనదొడ్డి తండా గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ (30) అనే వివాహిత చెట్టుకు ఉరివేసుకొని మృతిచెందిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగుచూసింది. రూరల్ ఎస్‌ఐ సురేష్ వివరాల మేరకు... ఈశ్వరమ్మ, దుర్గానాయక్ దంపతులకు 10 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వ్యవసాయంతో పాటు, పొట్టేళ్ల పెంపకం ద్వారా కుటుంబ పోషణ సాగిస్తున్నారు. అయితే ఈశ్వరమ్మ గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధ పడుతోంది. దీనికితోడు కొద్ది రోజులుగా కుటుంబ కలహాలు కూడా తోడవడంతో మనస్థాపం చెందిన ఈశ్వరమ్మ గురువారం ఉదయం తమకు ఉన్న 35 పొటేల్లను మేపుకు తీసుకెళ్లి పొలాల్లో ఉన్న చెట్టుకు ఉరివేసుకొంది.

అనంతలో యువకుడు..

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: తాగుడుకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకుంటున్న కొడుకును కాలనీకి దూరంగా తీసుకెళ్లి మార్చుకోవాలని చూసిన తల్లికి కడుపుకోతే మిగిలింది. బిడ్డ ఇక్కడి నుంచి రానని చెప్పి ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. త్రీటౌన్ సీఐ ధరణీకిషోర్ వివరాలమేరకు... స్థానిక గంగానగర్‌లో రమణమ్మ తన చిన్న కుమారుడు ఆనంద్‌తో కలసి నివాసం ఉంటోంది. పెద్ద కుమారుడు చిన్నవాడి వేధింపులు తట్టుకోలేక మరో కాలనీలో నివాసం ఉంటున్నాడు. కాగా ఆనంద్ (28) తాగుడుకు బానిసై పనిపాట లేకుండా మిత్రులతో కలసి తిరిగేవాడు. గంగానగర్ నుంచి బయటకు వెళితే బిడ్డ బాగుపడతాడని తల్లి భావించింది. పెద్ద కుమారుడి సలహా మేరకు స్థానిక జనశక్తి నగర్‌లో ఓ ఇల్లు అద్దెకు తీసుకుంది. అక్కడికి మారుదామని ఆనంద్‌కు చెప్పింది. ఆనంద్ అందుకు ససేమిరా అనడంతో గట్టిగా మందలించింది. దీంతో తాగిన మైకంలో మనస్థాపానికి గురైన ఆనంద్ ఇంట్లోకి వెళ్లి ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని ఆలస్యంగా గమనించిన తల్లి పెద్దకుమారుడి సహాయంతో త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించింది. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కొనకొండ్లలో వివాహిత..

వజ్రకరూరు: మండల పరిధిలోని కొనకొండ్ల గ్రామానికి చెందిన యశోద (29)అనే వివాహిత పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడింది. వజ్రకరూరు ఎస్‌ఐ రాజశేఖర్ వివరాలమేరకు... కొనకొండ్లకు చెందిన యశోద భర్త శేఖర్ బేల్దారి పనిచేస్తూ జీవనం సాగించేవాడన్నారు. బేల్దారి పనులు చేస్తూనే తరచూ వజ్రాలను వెతకడానికి ఇతర ప్రాంతాలకు వెళ్లేవాడన్నారు. వజ్రాలు వెతకడానికి తనను కూడా తీసుకెళ్లాలని యశోద తన భర్త శేఖర్‌ను కోరుతుండేదన్నారు. గురువారం సాయంత్రం గుంతకల్లుకు వెళుతున్నట్లు భర్త శేఖర్ చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లినట్లు తెలిపారు. అదే సమయంలో శేఖర్ భార్య యశోద భర్తకు ఫోన్ చేయగా వజ్రాలు వెతకడానికి ఇతర ప్రాంతానికి వచ్చినట్లు చెప్పాడన్నారు. దీంతో మనస్తాపనకు గురై ఇంట్లో ఉన్న పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు వెల్లడించారు. బంధువులు గమనించి వెంటనే గుంతకల్లులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించినట్లు ఎస్‌ఐ వెల్లడించారు. మృతురాలికి భర్తతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతురాలి తండ్రి గోవిందప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇక పటిష్టంగా పాఠశాల విద్య

• 'పాఠశాల నాయకత్వం'పై హెచ్‌ఎంలకు ప్రత్యేక శిక్షణ
• ఎంతో ఉపయోగపడుతోందంటున్న ప్రధానోపాధ్యాయులు
• వసతి ఏర్పాట్లపై పూర్తిస్థాయి సంతృప్తి



శిక్షణలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు

రాప్తాడురూరల్: పాఠశాల విద్యను బలోపేతం చేయడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు 'పాఠశాల నాయకత్వం' అనే అంశంపై శిక్షణ ఇస్తోంది. ఆరు రోజుల పాటు రెసిడెన్షియల్ విధానంలో సాగుతున్న ఈ ప్రత్యేక శిక్షణ తరగతులు ప్రధానోపాధ్యాయులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

నేటితో ముగియనున్న రెండో విడత శిక్షణ..

విద్యార్థులు మొదలు టీచర్లతో సమన్వయం, వివిధ వర్గాల ప్రజలతో సత్సంబంధాలు, పాఠశాలల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై విలువైన శిక్షణ ఇచ్చారని హెచ్‌ఎంలు చెబుతున్నారు. పాఠశాలల నిర్వహణలో హెచ్‌ఎంలకు ఎదురయ్యే అనేక సమస్యలకు ఈ శిక్షణ ద్వారా పరిష్కారం చూపించారు. అనంతపురం, శ్రీ సత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల హెచ్‌ఎంలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లకు అనంతపురం నగర శివారులోని టీటీడీసీ కేంద్రం వేదికగా ఈనెల 18 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. తొలివిడత శిక్షణ 23న ముగిసింది. రెండో విడత 24 నుంచి ప్రారంభం కాగా నేడు (శనివారం) ముగియనుంది. మరో మూడు, నాలుగు విడతల్లో మరింత మంది హెచ్‌ఎంలు శిక్షణకు హాజరుకానున్నారు.

లోటుపాట్లు లేకుండా చర్యలు..

రెసిడెన్షియల్ విధానం శిక్షణ అయినా ఏ ఒక్కరూ ఇబ్బంది లేకుండా మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో శిక్షణ సాగుతోంది. రోజూ రాత్రి వేళల్లో పాటలు పాడటం, సంగీతం, జోక్స్, నాటికల ప్రదర్శన, డ్యాన్సుల తదితర కార్యక్రమాలతో అలరిస్తున్నారు. డీఈఓ సాయిరామ్ పర్యవేక్షణలో శిక్షణలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు చేశారు. డీఈఓ రోజూ తన మధుర గానంతో అలరిస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు.

అంతరాయాల పర్యవేక్షణకు కాల్ సెంటర్లు

• ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు



మాట్లాడుతున్న సంతోషరావు

తిరుపతి రూరల్: రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) సీఎండీ సంతోషరావు సూచించారు.. తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాలో ఎదురయ్యే అంతరాయాలను పర్యవేక్షించడానికి సర్కిల్ కేంద్రాల్లోని సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్/టెక్నికల్ నియంత్రణలో ఈ పర్యవేక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే ఉన్న టోల్ ఫ్రీ నెంబరు 1912 కు అదనంగా ఈ కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. అనంతపురానికి సంబంధించి 94910 67446 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

'స్మార్ట్'గా కాపీయింగ్

• విద్యార్థిని డీబార్ చేసిన అధికారులు



పట్టుబడిన స్మార్ట్ వాచీ

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం డిగ్రీ రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే శుక్రవారం అనంతపురం నగరంలోని ఎస్ఎల్ఎన్ కాలేజీలో జరిగిన పరీక్షల్లో పీవీకేకే డిగ్రీ కాలేజీకి చెందిన సాకే దివ్య తేజ (బీకాం కంప్యూటర్స్) స్మార్ట్ వాచీ సాయంతో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడ్డాడు. తొలుత వర్సిటీ ఉన్నతాధికారులు డిజిటల్ వాచీ అని పెద్దగా పట్టించుకోలేదు. అక్కడే ఉండి తీక్షణంగా పరిశీలించడంతో స్మార్ట్‌వాచీ సాయంతో జవాబులు చూస్తూ రాస్తున్నట్లు గుర్తించారు. సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ అనే సబ్జెక్టు కావడంతో వాటికి సంబంధించిన వివరాలు స్మార్ట్ వాచీలో ఉన్నాయి. వెంటనే స్మార్ట్‌వాచీని స్వాధీనం చేసుకుని విద్యార్థిని డీబార్ చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ జీవీ రమణ తెలిపారు. డిగ్రీ రెగ్యులర్ పరీక్షల్లో స్మార్ట్, డిజిటల్ వాచీలు, ఎల్రక్టానిక్స్ ఉపకరణాలు తీసుకరావడం నిషేధం అయినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంతో డీబార్ చేశామన్నారు.

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి



సీఎం వైఎస్ జగన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గౌతమి, ఎస్పీ శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ జేసీ గాయత్రీదేవి, అసిస్టెంట్ కలెక్టర్ కుశాల్‌జైన్



పంపనూరు వద్ద పార్కులో మొక్కలు నాటుతున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: భారీ వర్ష సూచన నేపథ్యంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో వర్షాలు, నదుల్లో వరద ప్రవాహం, సహాయ పునరావాస కార్యక్రమాలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం తాడేపల్లి నుంచి కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు ఎస్పీ కె.శ్రీనివాసరావు, ఇన్‌చార్జీ జాయింట్ కలెక్టర్ గాయత్రిదేవి, అసిస్టెంట్ కలెక్టర్ కుశాల్ జైన్ పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వర్షాల అనంతరం విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్యారోగ్యశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విపత్తు నిర్వహణ అధికారులు జాగ్రత్తగా ఉంటూ వర్షాలు, వాతావరణం గురించి ఎప్పటికప్పుడు సమాచారం తెలియజేయాలన్నారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా, నీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పారిశుధ్య కల్పనపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని చెప్పారు.

పచ్చదనాన్ని పెంపొందిద్దాం

ఆత్మకూరు: జిల్లాలో పచ్చదనాన్ని పెంపొందించేలా విరివిరిగా మొక్కలు నాటాలని కలెక్టర్ గౌతమి తెలిపారు. శుక్రవారం ఆత్మకూరు మండలం పంపనూరు వద్ద ఉన్న సిటీ పార్కులో ఐఏఎస్ ఆఫీసర్స్ వైఫ్స్ అసోసియేషన్ (ఐఏఎస్ ఓడబ్ల్యూఏ) ఆధ్వర్యంలో మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగంగా కలెక్టర్ గౌతమి, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ సతీమణి రిషిఖ, డీఎఫ్ఓ సందీప్ కృపాకర్ పార్కులో మొక్కలు నాటారు. కలెక్టర్ మాట్లాడుతూ మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగంగా జిల్లాలో 57,450 వేల వరకు మొక్కలు నాటనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే పంపనూరు పార్కుతో పాటు 30 ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ చంద్రశేఖర్ బాలాజీ, ఆర్డీఓ మధుసూదన్, ఎఫ్ఆర్ఓ . శ్రీనివాసులు, డీఆర్ఓ హుసేనప్ప, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శ్రీవేంకటేశ్వర వైభవం



స్వామివారికి పట్టువస్త్రాలు తెస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు



వైకుంఠవాసుడికి పూజలు చేస్తున్న అర్చకులు

అనంతపురం కల్చరల్: స్థానిక గుత్తిరోడ్డులోని ఓ ఫంక్షన్ హాలులో శ్రీవేంకటేశ్వర వైభవం శుక్రవారం నేత్రపర్వంగా సాగింది. తొలిరోజు కార్యక్రమాన్ని జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసులు, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ప్రారంభించారు. మొదట పార్వేట ఉత్సవం, ఊంజలసేవ, రాత్రి పవళింపు సేవలు జరిగాయి. వందలాది సంఖ్యలో భక్తుల గోవింద నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగించారు. ఉత్సవ విగ్రహాలను ఎస్పీ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నేత అంబటి ఆదినారాయణరెడ్డి ఊరేగింపుగా తీసుకొచ్చారు. తిరుమల నుంచి వచ్చిన వేదపండితులతోపాటు బాలాజీ శర్మ, నాగరాజు శర్మ శాస్త్రోక్తంగా తొలిరోజు కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో జరిపించారు. కొత్తూరు అమ్మవారిశాల మహిళల బృందం కోలాట నృత్యం ఆకట్టుకుంది. నిర్వాహకులు మాట్లాడుతూ శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు పెద్ద ఎత్తున శ్రీవారి వైభవం సాగుతుందన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్ర అధికారి శ్రీనివాసులు, నాట్యాచార్యులు సంధ్యామూర్తి, బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు శ్రీనిధి రఘు, ఆర్యవైశ్య ప్రముఖులు ఆదిశేషయ్య, వంకదారు వెంకటకృష్ణ, కార్యక్రమ నిర్వాహకులు విజయ్ కుమార్, రాఘవేంద్ర, నాయక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాషువా కళాపరిషత్ జాతీయ కన్వీనర్‌గా కృష్ణమూర్తి

అనంతపురం కల్చరల్: గుర్రం జాషువా స్మారక కళాపరిషత్ జాతీయ కన్వీనర్‌గా జిల్లాకు చెందిన సాహితీవేత్త దాసగాని కృష్ణమూర్తిని ఎంపిక చేశారు. ఈ మేరకు సంస్థ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ పెద్దిటి యోహాను గురువారం నియామక పత్రం అందించారు. అనంత సాహితీ సాంస్కృతిక సేవా రంగాల్లో విశేష కృషి చేస్తున్న దాసగాని కృష్ణమూర్తి మహాబోధి సాహిత్య వేదిక ద్వారా స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహాకవి గుర్రం జాషువా సాహిత్యాన్ని విశ్వవ్యాప్తం చేయడానికి కృషి చేస్తానన్నారు. దాసగాని కృష్ణమూర్తిని సాహితీవేత్తలు రాచపాలెం చంద్రశేఖర రెడ్డి, డాక్టర్ పతికి రమేష్ నారాయణ, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అభినందించారు.

చిరస్మరణీయుడు తరిమెల నాగిరెడ్డి



సభలో మాట్లాడుతున్న ఓపీడీఆర్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలు

అనంతపురం కల్చరల్: కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి చిరస్మరణీయుడని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యత కేంద్రం (ఎంఎల్) ఆధ్వర్యంలో విప్లవ యోధులు తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు సంస్మరణ సభ నిర్వహించారు. యూసీసీఆర్ఐ నాయకుడు భాస్కర్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి ఓపీడీఆర్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలు, విరసం మాజీ సభ్యుడు జెట్టీ జైరామ్, భారత చైనా మిత్ర మండలి రాష్ట్ర కార్యదర్శి అజయ్‌రెడ్డి, గ్రామీణ పేదల సంఘం నాయకులు భాస్కర్ ముఖ్య వక్తలుగా నాగిరెడ్డి, దేవుల పల్లి విశిష్ట జీవిత విశేషాలపై మాట్లాడారు. అంతకు ముందు ఉద్యమగీతాలతో కళాకారులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పలువురు రచయితలు, కవులు పాల్గొన్నారు.

ఫీవర్ సర్వే పక్కాగా చేపట్టాలి

- జిల్లా మలేరియా అధికారి ఓబులు



శ్రీనివాస్‌నగర్‌లో డ్రైడేని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి ఓబులు

అనంతపురం క్రైం: ఫీవర్ సర్వే పక్కాగా చేపట్టాలని ఏఎన్‌ఎం, ఆశావర్కర్లను జిల్లా మలేరియా అధికారి ఓబులు ఆదేశించారు. శుక్రవారం నగరంలోని శ్రీనివాస్‌నగర్‌లో జరుగుతున్న ఫీవర్ సర్వే, డ్రైడేని ఆయన పరిశీలించారు.అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. జ్వరబాధితులకు కిట్ మెథడ్ ద్వారా పరీక్షలు చేసి, పాజిటివ్ అని తేలిన వారిని ప్రభుత్వ సర్వజనాస్పత్రికి రెఫర్ చేయాలన్నారు. డెంగీ, మలేరియా తదితర దోమకాటు వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, సూపర్‌వైజర్లు నూర్‌బాషా, అంగన్‌వాడీ టీచర్లు అనిత, అలీమా, ఆశ, తదితరులు పాల్గొన్నారు.

నా కూతురికి కేజీబీవీలో సీటు ఇప్పించండి



కూతురితో కలిసి సమగ్రశిక్ష కార్యాలయానికి వచ్చిన సుధాకర్ దంపతులు

రాప్తాడురూరల్: నాకూతురికి కేజీబీవీలో 8వ తరగతిలో ప్రవేశం కల్పించాలని గుత్తి మండలం బేతాపల్లికి చెందిన జి.సుధాకర్ అధికారులను కోరాడు. శుక్రవారం భార్య సుజాత, కూతురు అశ్వినితో కలిసి సమగ్ర శిక్ష కార్యాలయానికి వచ్చాడు. సమగ్ర శిక్ష ఏపీఓ, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్, జీసీడీఓ వాణీదేవిని కలిసి వారు అభ్యర్థించారు. పాట్లేళ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న సుధాకర్ రెండేళ్ల కిందట డయాలసిస్ బారిన పడ్డాడు. అప్పటి నుంచి వారంలో మూడు రోజులు డయాలసిస్ కోసం అనంతపురానికి వస్తున్నాడు. ఈయన భార్య సుజాత కూలి పనులకు వెళ్లేది. ఈమె కూడా అనారోగ్యంతో బాధపడుతోంది. వీరికి కూతురు సుజాత, కొడుకు విష్ణు సంతానం. కొడుకు గుంతకల్లులో 5వ తరగతి చదువుతున్నాడు. కూతురు సొంతూరులోనే 7వ తరగతి వరకు చదివింది. 8వ తరగతికి కేజీబీవీలో ప్రవేశం కల్పించాలని అధికారులను కోరుతున్నారు.

31 వరకు గడువు పొడిగింపు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో డిప్యూటీ రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, సూపరింటెండెంట్ల పదోన్నతులకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 31 వరకు గడువు పొడిగించినట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు గడువు శుక్రవారానికి ముగిసింది. తిరిగి నెలాఖరువరకు గడువు పొడిగించినట్లు తెలిపారు.

నేడు 'తొలి అడుగులు' కథా సంకలనం ఆవిష్కరణ

అనంతపురం కల్చరల్: 'తొలి అడుగులు' కవితా సంకలనాన్ని శనివారం ఆవిష్కరిస్తున్నట్లు ప్రముఖ రచయిత్రి నిర్మలారాణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక శారదానగర్‌లోని ఆచార్య దేవకీ స్వగృహంలో ఉదయం 10 గంటలకు డాక్టర్ రాచపాలెం చంద్రశేఖర రెడ్డి చేతుల మీదుగా సంకలనం ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురం రూరల్ పరిధిలోని కందుకూరుకు చెందిన అశోక్ అనే వ్యక్తిపై శుక్రవారం పోక్సో కేసు నమోదైంది. బాలికకు మాయ మాటలు చెప్పి ప్రేమ పేరుతో మోసం చేశాడని అనంతపురం వన్‌టౌన్ పోలీసులకు బాధిత కుటుంబ సభ్యులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు.

త్వరలోనే వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు



స్థలాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు తిప్పలూరి సుధీర్ రెడ్డి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు తిప్పలూరి సుధీర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం క్యాంపస్‌లో డాక్టర్ వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు స్థలాన్ని పరిశీలించారు. సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాల ప్రదాతగా వైఎస్సార్ రైతులకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, 108, పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, జల యజ్ఞం, ఇందిరమ్మ ఇళ్లు ఇలా ఎన్నో పథకాలు అమలు చేశారన్నారు. అలాంటి మహోన్నత మూర్తి భావి తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలవాలనే ఉద్దేశంతో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న వర్సిటీ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని వర్సిటీల్లో వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, అదే తరహాలో ఎస్కేయూ క్యాంపస్‌లో విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి జీవీ లింగారెడ్డి, బోధనేతర సంఘం మాజీ అధ్యక్షుడు టి. పురుషోత్తం రెడ్డి, ఎస్కేయూ వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు కిరణ్, అనిల్, చిగండి రమేష్, బల్లిబోయిన సురేష్, హేమంత్ కుమార్, నితిన్ రెడ్డి, హనుమంతు రెడ్డి, సేతురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఈఆర్వో నరసింహారెడ్డి

రాప్తాడు: పారదర్శకంగా ఓటరు జాబితా సవరణ చేయాలని డీఆర్‌డీఏ పీడీ, ఎన్నికల ఈఆర్వో నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు తదితర అంశాలపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కొత్త ఓటర్ల జాబితాలతో వచ్చే నెల 21 వరకు ప్రతి ఇంటికీ బీఎల్‌ఓలు వస్తారని, ఓటర్లు తమ పేర్లు, ఆధార్ నంబర్లు, ఇంటి పేర్లు తదితర వివరాలు జాబితాలో సరిగా ఉన్నవీ లేనివి సరిచూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరు మండలాల తహసీల్దార్లు, ఈడీటీ విజయ్ కుమార్, వివిధ మండలాల రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

చెన్నేకొత్తపల్లి: ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా చెన్నేకొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆయన అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాతావరణ కలుష్యాన్ని నివారించాలంటే మొక్కలు విరివిగా నాటాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ షాబుద్దీన్, ఎంపీడీఓ గంగావతి, ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవింద రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ అనురాధ, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అందించాలి

- జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎస్పీ కె. శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పిల్లలకు విలువలతో కూడిన విద్యను అందించాలని జిల్లా ఎస్పీ కె. శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం స్థానిక పోలీసు రక్షక్ ప్రీప్రైమరీ స్కూల్ పేరెంట్స్ వెరిఫికేషన్ కార్యక్రమంలో ఆయన పిల్లల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ఎస్పీ మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకతను వెలికి తీయాలన్నారు. విద్యతో పాటు ఆటపాటల్లోనూ పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనేలా చూడాలన్నారు. విద్యార్థి దశలో ఇష్టంతో చదవాలని, అప్పుడే ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో బెంగళూరు క్రీడో ఏజెన్సీ మేనేజర్ నందిని, అదనపు ఎస్పీ ఆర్. విజయభాస్కరరెడ్డి, ప్రైమరీ స్కూల్ కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిట్టితల్లిని అక్కున చేర్చుకున్న 'అమ్మ'



స్రవంతికి నగదు, నిత్యావసరాలు అందిస్తున్న అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: తోటి పిల్లలతో కలిసి ఆటపాటలతో ఆనందంగా గడపాల్సిన చిట్టితల్లిని కష్టాలు చుట్టుముట్టాయి. అభంశుభం తెలియని వయసులో తల్లి దూరమైంది. అన్నీ తానై అల్లారుముద్దుగా చూసుకోవాల్సిన తండ్రి కూడా మంచానపడ్డాడు. దిక్కుతోచని స్థితిలో బిక్కుబిక్కుమని గడుపుతున్న అమ్మాయిని ' అమ్మ' స్వచ్ఛంద సంస్థ రమణారెడ్డి అక్కున చేర్చుకున్నాడు. నిత్యావసర సరుకులు, నగదు ఇచ్చి ఆదుకున్నాడు. వివరాలు.. నల్లమాడకు చెందిన సూర్యనారాయణ కొబ్బరి బోండాలు అమ్ముతూ కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడు. అతని భార్య లక్ష్మీదేవి దినసరి కూలీగా చేస్తూ చేదోడు వాదోడుగా ఉండేది. 13 ఏళ్ల కూతురు స్రవంతికి తోడు ఉండాల్సిన సమయంలో లివర్ వ్యాధితో లక్ష్మీదేవి మృతి చెందింది. కూతురు సంరక్షణ చూసుకోవాల్సిన తండ్రి కూడా జబ్బుతో మంచానపడ్డాడు. చిన్నవయసులో ఆమెను పుట్టెడు కష్టాలు చుట్టుముట్టాయి. ఇల్లు లేదు ఊరిచివరన టార్పాల్‌తో వేసిన గుడిసెలో తలదాచుకుంటున్న తండ్రీ కూతురు పూట గడవక, మందులు కొనలేక తల్లడిల్లుతుండగా , అమ్మ సంస్థ అధ్యక్షుడు రమణారెడ్డి ఆదుకున్నాడు. శుక్రవారం తండ్రీకూతురు ఉంటున్న గుడిసె వద్దకు వెళ్లి రూ.18 వేల నగదు, రూ.25 వేలు విలువ చేసే నిత్యావసర సరుకులు అందించాడు. తండ్రీకూతురుకు పదిజతల దుస్తులు ఇచ్చి ఆదుకున్నాడు. భవిష్యత్తులో చిన్నారి చదువుకు చేయూతనిస్తానని భరోసా కల్పించాడు. దాతలు ఎవరైనా ముందుకొచ్చి చిన్నారిని ఆదుకోవాలని రమణారెడ్డి కోరారు.



ఆత్మకూరులో పీర్ల స్వాములను దర్శించుకుంటున్న భక్తులు



ఆత్మకూరులో సర్దార్‌వలి దర్గాలో చక్కెర చదివిస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో మొహర్రం

ఆత్మకూరు: మండల కేంద్రంలో భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు శుక్రవారం నిర్వహించారు. జిల్లా నలు మూలల నుంచి వేలాదిగా తరలివచ్చి పీర్లస్వాములను దర్శించుకున్నారు. మండల కేంద్రంలోని సర్దార్‌వలి దర్గాలో చక్కెర చదివింపులు చేయించారు. మొక్కుబడి తీర్చుకున్నారు. పెద్ద సరిగెత్తులో భాగంగా భక్తులు పానకాలు తెచ్చి పీర్లచావిడిలో చదివించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరువ

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు చేరువ చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురం రూరల్ పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి హాజరై అర్హులకు వివిధ రకాల సర్టిఫికెట్లను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అవినీతి,అక్రమాలకు తావులేకుండా పాలన సాగిస్తున్న ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉదయ్‌శంకర్, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ చంద్రకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు జయరాంనాయుడు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం క్రైం: 'ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందించాలన్న తాపత్రయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం తపోవనం సర్కిల్‌కు సమీపంలో ఉన్న వైవీఆర్ ఫంక్షన్ హాల్‌లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సర్టిఫికెట్లు, రేషన్ కార్డులు అందించారు. వచ్చే నెల 5వ తేదీ వరకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పొడిగించారని, ఇంకా మిగిలిన ఇళ్లకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని సర్టిఫికెట్లకు దరఖాస్తు చేయించాలని సచివాలయ సిబ్బంది, వలంటీర్లను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమం పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి, మాజీ మేయర్ రాగే పరుశురాం, కార్పొరేటర్లు గురుశేఖర్‌బాబు, సంపంగి రామాంజనేయులు, బాబా, కమల్‌భూషణ్, రాజేశ్వరి, జయలలిత, ఇస్సాక్, మునిశేఖర్, దుర్గాదేవి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, పార్టీ నగరాధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు కృష్ణవేణి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, నాయకులు సుజాత, అనిల్‌కుమార్ గౌడ్, కుళ్లాయస్వామి, నాగార్జున రెడ్డి పాల్గొన్నారు.

నగర రూపురేఖలు మార్చేశాం ..

నగరంలోని అన్ని డివిజన్లలో ప్రాధాన్యత క్రమంలో పెద్ద ఎత్తున అభివృద్ధి చేపట్టి, నగరం రూపురేఖలు మార్చినట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. శ్రీనగర్ కాలనీలో మారుతీనగర్ మీదుగా శ్రీనగర్ కాలనీ, ఎన్‌హెచ్ 44కు అనుసంధానం చేసేందుకు సీఎం ప్రత్యేక నిధులు రూ.1.84 కోట్లతో ఒక కిలోమీటర్ వరకు ఏర్పాటు చేయనున్న బీటీ రోడ్డు పనులకు(డబుల్ రోడ్డు) శుక్రవారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. నగరపాలక సంస్థ సాధారణ, 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు సీఎం ప్రత్యేక నిధులు రూ.25 కోట్లు, గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.14.80 కోట్లతో అపరిష్కృత సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్, ఇస్సాక్, నాయీ బ్రాహ్మణ డైరెక్టర్ శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, నాయకులు ఖాజా, లోక్‌నాథ్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, నరసింహులు, భాస్కర్, కృష్ణ, పాల్గొన్నారు.

లీజుకు ఆర్టీసీ స్థలం

అనంతపురం సెంట్రల్: నగరంలో ఆర్ఎం కార్యాలయం ఎదురుగా ఉన్న ఆర్టీసీ స్థలాన్ని 33 ఏళ్ల కాల పరిమితితో లీజుకు ఇవ్వాలని నిర్ణయించినట్లు ఇన్‌చార్జ్ ఆర్ఎం రమేష్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్తర భాగంలో ఉన్న చంద్ర హాస్పిటల్‌కు ఎదురుగా ఉన్న స్థలాన్ని రెండుగా విభజించినట్లు తెలిపారు. రెండో భాగం 4,330 చదరపు గజాలు, మూడో భాగం 3,845 చదరపు గజాలు వేరు చేసినట్లు తెలిపారు. వచ్చేనెల 1న ఉదయం 11 గంటలకు ఔత్సాహిక వ్యాపారులు, పారిశ్రామికవేత్తలకు అవగాహన సదస్సు ఉంటుందన్నారు. లీజు వివరాలను www.apsrtc.ap.gov.in వెబ్ సైట్‌లో సంప్రదించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం రూరల్: గ్రామీణ నీటి సరఫరా పథకంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ రూరల్ వాటర్ సప్లై పథకంలో పని చేస్తున్న కార్మికులకు పెరిగిన ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి పని చేస్తున్న వారికి సరైన గుర్తింపు లేదన్నారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. సీఐటీయూ నాయకులు, శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు పాల్గొన్నారు.

త్వరలో మెరుగైన వైద్య సేవలు

అనంతపురం క్రైం: భవిష్యత్‌లో క్యాజువాలిటీ (ఎమర్జెన్సీ వార్డు), అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్ (ఏఎంసీ) వెళ్తాయని, వీటి ద్వారా మెరుగైన వైద్యసేవలు అందుతాయని సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. శుక్రవారం జీజీహెచ్‌లోని క్యాజువాలిటీ, ఏఎంసీలను సూపరింటెండెంట్ పరిశీలించారు. రోగికి ఉత్తమ సేవలందించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మౌలిక సదుపాయాల ఆవశ్యకతపై సమగ్ర నివేదిక సమర్పించాలని ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసులను సూపరింటెండెంట్ ఆదేశించారు. అనంతరం టీబీ వార్డును పరిశీలించారు. డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, హెడ్ సిస్టర్ ఆశాలత, ఐసీఎన్ సిస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

'ఉలవచారు' రెస్టారెంట్ ప్రారంభం



జ్యోతిప్రజ్వలన చేసి ఉలవచారు రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రోజా

రాప్తాడురూరల్: అనంతపురం శివారులోని జాతీయ రహదారి- 44 పక్కన ఏర్పాటు చేసిన ఉలవచారు రెస్టారెంట్‌ను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, అహుడా చైర్మన్ మహాలక్ష్మీ శ్రీనివాస్‌తో కలిసి రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి రోజా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం పర్యాటకంగా అభివృద్ధి చెందుతోందని, తద్వారా దేశంలోనే ఏపీ మూడో స్థానంలో ఉందన్నారు. పర్యాటక ప్రదేశాల్లో స్థానిక ప్రత్యేక రుచులను పర్యాటకులకు అందిన్నారు. అనంతలో 'ఉలవచారు' రెస్టారెంట్ ప్రారంభం కావడంతో ఈ ప్రాంత వాసులు కూడా ఉలవచారు రుచులు చూస్తారన్నారు. రాజుగారి కోడి పలావ్‌తో పాటు బాంగ్లా కోడి, కొర్రమీను ఫిష్ తందూరి, పచ్చిమిర్చి బిర్యానీ, ఆవకాయ బిర్యానీ తదితర ప్రత్యేక వంటకాలు ఇక్కడ లభిస్తాయన్నారు. కార్యక్రమంలో అనంతపురం మార్కెట్‌యార్డ్ చైర్మన్ ఫయాజ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, వైటీ శివారెడ్డి, ఉలవచారు ఫౌండర్ వినయ్, కోఫౌండర్ విజయ్, నిర్వాహకులు వీరారెడ్డి, నిఖిల్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ దోషులను ఉరితీయాలి

రాప్తాడు: మణిపూర్‌లో గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారం చేసినవారిని ఉరితీయాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నియోజకవర్గ అధ్యక్షుడు విశ్రాంత హెచ్‌ఎం అంజయ్య ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మణిపూర్ ఘటన హేయమైన చర్య అన్నారు. రెండు నెలలుగా మణిపూర్‌లో చోటు చేసుకుంటున్న అల్లర్లు, మారణహోమాలు, అత్యాచారాలకు అడ్డుకట్ట వేసి శాంతిని నెలకొల్పే విషయంలో ఆ రాష్ట్ర బీజేపీ ప్రభుత్వం, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ రాప్తాడు నియోజకవర్గ ఇన్‌చార్జి ఓబులేష్, జిల్లా అధ్యక్షులు గద్దల నాగభూషణం, ఉపాధ్యాక్షులు వెంకటయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ కుల్లాయప్ప, మాజీ జిల్లా అధ్యక్షులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.


చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమే



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి

అనంతపురం: అకడమిక్‌గా ప్రతిభ చాటడంతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి అన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం స్పోర్ట్స్ డే నిర్వహించారు. కార్యక్రమానికి డీఐజీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రైవేట్ వర్సిటీల్లో కేవలం విద్యకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. కానీ పబ్లిక్ వర్సిటీల్లో అకడమిక్‌తో పాటు క్రీడల్లోనూ అవకాశం కల్పిస్తారన్నారు. ఇక్కడ చదువుకోవడం అదృష్టంగా భావించాలన్నారు. ప్రతి విద్యార్థీ క్రమశిక్షణ, కష్టపడే మనస్తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

టీచర్లను సర్దుబాటు చేయాలి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు

రాప్తాడురూరల్: అవసరమున్న పాఠశాలలకు టీచర్లను సర్దుబాటు చేసి బోధనకు ఇబ్బంది లేకుండా చూడాలని వైఎస్సార్ టీచర్స్‌ఫెడరేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.నాగిరెడ్డి మాట్లాడుతూ.. అప్‌గ్రేడ్, సర్‌ప్లస్ టీచర్లు, హెచ్‌ఎంలకు సంబంధించి జూన్, జూలై నెలలకు సంబంధించిన జీతాలు మంజూరు చేసేలా చూడాలన్నారు. పాఠశాలల సముదాయాల నిర్వహణ సమయాన్ని ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉండేలా సవరించాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీధర్‌గౌడ్, నాయకులు చెన్నారెడ్డి, బి.నారాయణ, కంబగిరి రాముడు, రమణప్ప తదితరులు ఉన్నారు.